

విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు

నేడు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలో 220 కెవి సబ్ స్టేషన్ చిత్తూరు లో మరమ్మతుల కారణంగా 19 తేదీ శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు గిరింపేట మిట్టూరు రాంనగర్ కాలనీ బాలాజీ నగర్ ప్రాంతాలతో పాటు తుమ్మింద పాళ్యం, ఐఒసి పరిశ్రమ యాదమరి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎస్పీడీసీఎల్ ఈఈ ముని చంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతపేట, పరిసర ప్రాంతాలు, పై పల్లె, చెర్లోపల్లి, వెంగన పల్లె, మురకంబట్టు, యస్‌విసెట్ కాలేజి, సీతమ్స్ కాలేజి, అపోలో కాలేజీ, పరిసర ప్రాంతాలతో పాటు అరగొండ, కొంగారెడ్డిపల్లి పల్లె పరిసర ప్రాంతాలు, మోర్గాన పల్లి, బుడితిరెడ్డి పల్లె, రెడ్డిగుంట పరిసర ప్రాంతాల్లోనూ ఉదయం 9 గంటల నుండి రాత్రి ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

షికారీ కాలనీలో మౌలిక వసతులు కల్పించండి

అధికారులకు జేసీ ఆదేశం

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): షికారీ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జేసీ విద్యాధరి ఆదేశించారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ యదమరి మండలం కినాటం పల్లి గ్రామ పంచా యతీ పరిధిలోని షికారి కాలనీ గ్రామాన్ని సందర్శిం చారు. గ్రామస్తులతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు జాయింట్ కలెక్టర్‌కు పలు సమస్యలు వివరించారు. గ్రామంలో కొంతమందికి ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు లేవని, పింఛన్లు ఇప్పించాలని కోరారు. నిర్మించిన హౌసింగ్ ఇళ్లు శిథిలావస్థకు చేరాయని ఇళ్లు మరమ్మతులకు నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో శ్మశానం, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించా లన్నారు. షికారులకు గతంలో ప్రభుత్వం వ్యవసాయ భూములు మంజూరు చేశారని దానికి విద్యుత్ బోరు సౌకర్యం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని జేసీని షికారులు కోరారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేశారని అందులో భాగంగా మారుమూల గ్రామమైన షికారి కాలనీ ఎంపిక చేశారని ప్రతి ఇంటిని పూర్తి స్థాయిలో సర్వే చేయాలని తెలిపారు. గ్రామాల్లో స్థానిక అవసరాలను అనుసరించి కొన్ని పనులు మార్పులు చేసి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులు ఆదేశించారు. షికారీ కాలనీలో ఉన్న ప్రతి ఇంటికి మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. పీ4 కేవలం దాతృత్వ కార్యక్రమం కాదని, గ్రామాలు స్వయం సమృద్ధిని సాధించి, స్వయంగా ఇతర గ్రామాలకు సహాయపడే శాశ్వత సామాజిక ఉద్యమంగా భావించా ల్సిన అవసరం ఉందని జేసీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యాదమరి తహశీల్దార్ పార్థసారథి, మండల అభివృద్ధి అధికారి వేణు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పలు శాఖల అధికారులు, ఎస్‌సి నాయకులు మురుగేషన్, చిట్టిబాబు పాల్గొన్నారు.



షికారీ కాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జేసీ విద్యాధరి



మాట్లాడుతున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టరు హనుమంతరావు

మాతా శిశు సంరక్షణ

పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ హనుమంతరావు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: మాతా శిశు సంరక్షణ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టరు హనుమంతరావు ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆదేశాలతో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ హనుమంతరావు జిల్లాలోని ఆశా నోడల్ అధికారులతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మీటింగ్ హాల్ లో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మాతా శిశు సంరక్షణ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. గర్భిణీగా నమోదు మొదలుకొని మనం ఇచ్చే ప్రతి సేవ కచ్చితత్వంతో ఉండాలని, వెయ్యి రోజుల పాటు వారిపై నిఘా ఉంచి ప్రతి సేవ ఎప్పటికప్పుడు అందించాలన్నారు. తద్వారా మాత శిశు మరణాలు లేని సమాజ స్థాపనకు కృషి చేసిన వారు అవుతామన్నారు. సమాజంలో ఆరోగ్యానికి మొదటి సూచిక మాత శిశు మరణాలు లేని సమాజం మాత్రమే. కావున ఆ దిశగా మనమిచ్చే ప్రతి సర్వీసు ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు ,ఎం.ఎల్ హెచ్ పి ల ద్వారా సేవలను మానిటర్ చేస్తూ ఎప్పటికప్పుడు అందించినట్లయితే ఆరోగ్య సమాజం తథ్యం అన్నారు. హై రిస్క్ గర్భిణులకు అత్యధిక ప్రాధాన్యత నిచ్చి కాన్పుకు వారం ముందే ఆసుపత్రిలో చేర్చి సుఖ ప్రసవం అయ్యేలా చూడాలన్నారు. రక్తహీనత ఉన్నవారికి శుక్రోస్ ఫ్లూయిడ్ ఇప్పించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని 100 శాతం అందించేటట్లు ప్రతి బిడ్డకు టీకాలు వేయించాలన్నారు. పీహెచ్సీ ఏరియాలలో వర్క్ ప్లేస్ లలో బీపీ ,షుగర్ ప్రత్యేక క్యాంపు నిర్వహించాలన్నారు. సంక్రమణ, అసంక్రమణ వ్యాధులపై నిఘా ఉంచి ప్రతి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లన్నారు. ఆశాలు ప్రతిరోజూ తప్పకుండా ఆప్ ను లాగిన్ చేయాలి. అర్హులైన దంపతుల అప్డేషన్ కొత్తగా నమోదయ్యే ప్రెగ్నెన్సీస్ నమోదు, కాన్పు అయిన తర్వాత హెచ్బిఎన్సి సేవలు, హెచ్ బి వై సి సేవలు, ఐరన్ సిరప్ పంపిణీ తప్పక అప్‌డేట్ చేయాలన్నారు. పిహెచ్సి పరిధిలో చేసే ప్రతి ఆరోగ్యకర కార్యక్రమాన్ని నోడల్ అధికారులు మానిటర్ చేస్తే మంచి ఫలితాలు అందించ వచ్చున్నారు. అన్ని రకాల యాప్స్‌లో ఏ రోజుకు ఆ రోజు పూర్తి అయ్యేటట్లు చూడాలన్నారు. పిసిపిఎన్డిటి ఆక్ట్ పై ప్రత్యేక నిఘా ఉంచి ఈ కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ కుమార్, జయరాముడు, శ్రీవాణి, మూర్తి, ఆశ నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

35 మంది డిప్యూటీ తహశీల్దారులు బదిలీ

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): చిత్తూరు జిల్లాలో వివిధ కేటగిరీల కింద 35 మంది డిప్యూటీ తహశీల్దారులను బదిలీ చేస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. తహశీల్దారు కార్యాలయాల్లో పనిచేస్తున్న 19 మంది డీటీలను, 14 మంది రీసర్వే తహశీల్దార్లను, ఇద్దరు ఎలక్షన్ డిటీలను, ముగ్గురు ఆర్‌డీవో కార్యాలయంలో పనిచేస్తున్న డీటీలను, కలెక్టర్ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఒక డీటీని, డిఎస్‌ఓ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఆరుగురు డీటీలను బదిలీ చేస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

పాలసముద్రంలో పనిచేస్తున్న రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు ప్రవీణ్ కుమార్‌ను పులిచెర్ల డిప్యూటీ తహశీల్దారుగా, చిత్తూరు సివిల్ సప్లై ఆఫీసులో పనిచేస్తున్న కిషోర్‌ను సదం డిప్యూట తహశీల్దారుగా, చౌడేపల్లి సర్వే డీటీగా పనిచేస్తున్న మాధవిని సోమల డీటీగా, పులిచెర్ల డీటీగా పనిచేస్తున్న దిలీప్ కుమార్‌ను ఐరాల డీటీగా, గుడిపల్లి రీ సర్వే డీటీగా పనిచేస్తున్న అశ్రఫ్ అలీషాను విజయపురం డీటీగా, ఐరాల డీటీగా పనిచేస్తున్న మహేష్ ను గంగాధర నెల్లూరు డీటీగా, యాదమరి రీ సర్వే డీటీ గా పని చేస్తున్న జయంతిని యాదమరి డిప్యూటీ తహశీల్దారుగా బదిలీ చేశారు. చిత్తూరు డిఎస్‌ఓ కార్యాలయంలో డీటీగా ఉన్న ఈశ్వర్‌ను వెదురుకుప్పం డీటీగా, పాలసముద్రం డీటీగా ఉన్న రిషి వర్మను పాలసముద్రం డీటీగా, రొంపిచెర్ల రీ సర్వే డీటీగా ఉన్న లోకేషన్ కార్వేటినగరం డీటీగా, బదిలీ చేశారు. గంగాధర నెల్లూరు డీటీగా ఉన్న తులసీరామ్‌ను చిత్తూర్ అర్బన్ డీటీగా, తవణంపల్లి రీ సర్వే డీటీగా ఉన్న వెంకటరమణను గుడిపాల డీటీగా, చిత్తూరు అర్బన్ డీటీగా ఉన్న నరేష్ కుమార్‌ను పెనుమూరు డీటీగా, పలమనేరు డీటీగా ఉన్న అనిల్ కుమార్‌ను పలమనేరు డీటీగా, మార్చారు. గంగవరం రీ సర్వే డీటీగా ఉన్న సహనను గంగవరం డీటీగా, పెద్దపంజాణి రీ సర్వే డీటీగా ఉన్న రమేష్ బాబును పెద్దపెంజాని డీటీగా, కుప్పం డిటిగా ఉన్న ప్రసన్న కుమార్ ను బైరెడ్డిపల్లి డీటీగా, చిత్తూరు డిఎస్‌ఓ కార్యాలయంలో డీటీగా ఉన్న శివకుమార్‌ను శాంతిపురం డీటీగా, పుంగనూరు రీసర్వే డీటీ బాలాజీని రామకుప్పం డీటీగా బదిలీ చేశారు.

సోమల డీటీగా ఉన్న మధుసూదన్ ను సోమల రీ సర్వే డీటీగా, గంగవరం డీటీదొరస్వామిని చౌడేపల్లి రీ సర్వే డీటీగా, నగరి రీ సర్వే డీటీ నీలావతిని నింద్ర రీ సర్వే డీటీగా బదిలీ చేశారు. నింద్ర రీ సర్వే డీటీగా ఉన్న మేఘవర్ణంను నగరి రీసర్వే డీటీగా, వీకోట రీ సర్వే డీటీ శోభాను జీడి నెల్లూరు రీ సర్వే డీటీ గా మార్చారు. కార్వేటినగరం డీటీ త్యాగరాజును ఎస్‌ఆర్ పురం రీ సర్వే డీటీగా, పీలేరు ఎలక్షన్ డీటీ చంద్రశేఖర్‌ను వెదురుకుప్పం రీ సర్వే డీటీ గా బదిలీ చేశారు. కుప్పం ఎలక్షన్ డీటీ జోసెఫ్ ను గుడిపాల డీటీగా, గుడిపాల డీటీ లక్ష్మిని తవణంపల్లి సర్వే డీటీగా, శాంతిపురం రీ సర్వే డీటీ చంద్రశేఖర్‌ను యాదమరి రీ సర్వే డీటీగా, కుప్పం రీ సర్వే డీటీగా ఉన్న నరేంద్రను గంగవరం రీ సర్వే డీటీగా, పెద్దపంజాని డీటీ యోగేష్ ను పెద్దపంజాని రీ సర్వే డీటీగా బదిలీ చేశారు. చౌడేపల్లి డీటీ నందిని దేవిని శాంతిపురం రీ సర్వే డిటీ గా, రామకుప్పం డీటీ అశోక్ కుమార్‌ను పాలసముద్రం రీ సర్వే డీటీగా బదిలీ చేశారు.

డీఎస్‌ఓ ఆఫీస్ డిటీ ప్రకాష్ బాబును కుప్పం ఆర్డీవో ఆఫీసుకు డీటీగా, వెదురుకుప్పం రీ సర్వే డీటీ శివకుమార్‌ను కుప్పం ఆర్డీవో ఆఫీస్ డీటీగా, బైరెడ్డిపల్లి డిటి రామ్మూర్తిని కుప్పం ఆర్డీవో ఆఫీస్ డిటీగా బదిలీ చేశారు. డీఎస్‌ఓ ఆఫీసులో సివిల్ సప్లైస్ డీటీగా ఉన్న హరికృష్ణను కలెక్టర్ కార్యాలయంలో ఇనాం డీటీగా నియమించారు.

కలెక్టర్ కార్యాలయంలో ఇనాం డీటీగా ఉన్న రాజశేఖర్‌ను డిఎస్‌ఓ కార్యాలయం డిటిగా, కుప్పం సివిల్ సప్లై డిటీ రేఖను చిత్తూరు డిఎస్‌ఓ ఆఫీస్ డిటీగా, ఎస్‌ఆర్ పురం రీ సర్వే డిటి రవీంద్రబాబును చిత్తూరు డిఎస్‌ఓ ఆఫీస్ డీటీగా, సోమల రీ సర్వే డీటీగా ఉన్న ఇబ్రహీం ను చిత్తూరు డీఎస్‌ఓ ఆఫీస్ డీటీగా, అన్నమయ్య జిల్లా డీఎస్‌ఓ కార్యాలయ డిటి ఖాజావల్లిని చిత్తూరు డిఎస్‌ఓ ఆఫీస్ డీటీగా, రామకుప్పం రీ సర్వే డిటి పన్నీర్ సెల్వంను చిత్తూరు డీఎస్‌ఓ ఆఫీస్ డీటీగా బదిలీ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



పోలీసు స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఇంద్రజ కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో నిందితుడిగా పేర్కొంటున్న సత్తికుమార్)

మా బిడ్డను హత్య చేశారు..!

- కుటుంబ సభ్యుల ఆరోపణ
- న్యాయం చేయాలని నిరసన

ప్రజాశక్తి- కుప్పం:

తమ బిడ్డను హత్య చేశారని, నిందితులను కనుగొని కఠినంగా శిక్షించాలని కోరుతూ మృతురాలి కుటుంబ సభ్యులు కుప్పం పట్టణ పోలీసు స్టేషన్ ముందు శుక్రవారం బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ దొమ్మర అగ్రహారం గ్రామంలో కాపురం ఉంటున్న పెరుమాళ్ భార్య ఇంద్రజ (25) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని అయితే తమ బిడ్డను అదే గ్రామంలోని పాల డెయిరీలో పనిచేస్తున్న సత్తి కుమార్ హత్య చేశాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. తమ బిడ్డ చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాని వారు డిమాండ్ చేశారు. న్యాయం కోసం వారు రోడ్డుపై బైఠాయించడంతో కాసేపు స్థానికంగా రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. వెంటనే స్పందించిన పట్టణ సిఐ శంకరయ్య ఇంద్రజ మృతిపై పూర్తి విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. పోలీసుల హామీతో బాధిత కుటుంబ సభ్యులు తమ ఆందోళనను విరమించుకున్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి

కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ ఫోరం ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ 2003 ఉపాధ్యాయ ఫోరం నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా 2003లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన ఉపాధ్యాయులు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా 2003 ఉపాధ్యాయ ఫోరం జిల్లా కన్వీనర్లు బోడె మోహన్ యాదవ్, ఢిల్లీ ప్రకాష్, మధు, శ్రీధర్, కోదండ రెడ్డి వెంకటేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయు లుగా 2003లో బాధ్యతలు స్వీకరించిన వారికి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని అమలు చేయడం అత్యంత దారుణం అన్నారు. జీవో నెంబర్ 57 వెంటనే అమలు చేయాలని కోరారు. జీవో నెంబర్ 57 ప్రకారం ముగ్గురు ఐఏఎస్ అధికారులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల విషయంలో మెలిక పెట్టడం సరికాదన్నారు. 2003 నుండి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని పోరాటం చేస్తు న్నట్లు తెలిపారు. 2003 ఉపాధ్యాయుల పోరాటానికి ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మణికంత, ఎస్‌టియు నాయకులు గంటా మోహన్, మదన్మోహన్ రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు జీవి రమణ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం కలెక్టరుకు వినతిపత్రం అందించారు.



ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



అటవీ అధికారుల అదుపులో ఎర్రచందనం దొంగలు

ఎర్రచందనం దుంగలు పట్టివేత

ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి - రొంపిచర్ల: ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న ఏడుగురు నిందితులను అరెస్టు చేశామని అటవీ శాకాధికారులు శుక్రవారం తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో శుక్రవారం తెల్లవారు జామున పీలెరు డివిజనల్ అటవీ శాఖ అధికారి, సంచారదళ నిఘా విభాగం వారికి అందిన రహస్య సమాచారం మేరకు వాహనాలు శుక్రవారం ఉదయం తనిఖీ చేశారు. ఇదే సమయంలో మారుతి సుజుకి ఏపీ 03 ఎస్ 3913 వాహనంలో 13 ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తుండగా వాహనంలోనే దుంగలతో పాటు ఏడుగురిని పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తులు తమిళనాడు కలువ రాయ్ మలైకు చెందిన ఏలుమలై, సెంథిల్, ఆన్బలగన్, రామన్, అన్నా దురై, కుప్పు స్వామి, మణిలుగా గుర్తిం చామన్నారు. నిందితులను విచారించగా ఎర్రచందనం దుంగలను శేషాచలం అటవీ ప్రాంతం నుంచి తరలిస్తున్నట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగలు విలువ కారుతో సహా 20 లక్షలు ఉంటుందని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ దాడిలో డివిజనల్ అటవీ శాఖ అధికారి ఎం గురు ప్రభాకర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ చంద్రశేఖర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె ప్రకాష్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కె ప్రతాప్, పి రెడ్డి ప్రసాద్, నందీశ్వరయ్య, ప్రొటెక్షన్ వాచర్లు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పూడిపోయిన డ్రైనేజీలు

స్పందించని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి-చౌడేపల్లి: మట్టితో వీధి కాలువలు పూడిపోయి వ్యాధి కారకాలుగా మారుతున్నా సంబంధిత పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలోని శెట్టిపేట పంచాయతీ తోటకుర పల్లిలో ఈ పరిస్థితి నెలకొంది. వీధి కాలువలు ఉన్నప్ప టికీ మురికి నీరు రోడ్లపై నిలువ ఉంటున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు . రానున్నది వర్షాకాలం కావడంతో మురుగునీరు అంతా ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందంటున్నారు. సంబంధిత పంచాయతీ అధికారు లకు ఈ విషయం తెలిసినప్ప టికీ పట్టీపట్ట నట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు . ఇకనైనా అధికారులు స్పందించి తోటకురపల్లిలో వీధి కాలువలను పూడిక తీయించి ప్రజా ఆరోగ్యాన్ని సంరక్షించాలని వారు కోరుతున్నారు.



పూడిపోయిన డ్రైనేజీలు

ప్లాస్టిక్ బదులుగా సంచులు వాడండి: కమిషనర్

ప్రజాశక్తి -విజయపురం (నగరి): ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని, ప్లాస్టిక్ స్థానంలో గుడ్డ సంచులను, పేపర్ సంచులను వాడాలని నగరి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వ్యాపార సంఘ ప్రతినిధులు, పారిశుధ్య కార్యదర్శు లతో ఆయన సమావేశ మయ్యారు. వ్యాపారులకు ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే నష్టాలు, వాటి వల్ల ప్రజలకు కలిగే హానిని వివరించారు. పర్యావరణానికి ప్లాస్టిక్ వల్ల ముప్పు ఉందని కాలుష్య నియంత్రణకు దుకాణదారులు సహకరించా లన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా హోటల్ యజమానులు తమ హోటళ్లలో నిలువ చేసిన మాంసాహారాలు అమ్మకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, పర్యావరణ, పారిశుధ్య కార్యదర్శులు, ప్రజారోగ్యశాఖ మేస్త్రీలు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న నగరి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి

యూరియా కరువు

- ఎదుగుదల లేని పైరు
- రెండు బస్తాలు కావాలంటే కాంప్లెక్స్ కొనాల్సిందే!
- దుకాణదారుల నిబంధనలు
- అన్నదాతల ఆందోళన

ప్రజాశక్తి -వెదురుకుప్పం: యూరియా కొరతతో అన్నదాత అల్లాడుతున్నాడు. ఈ సంవత్సరంలో మామిడికాయలకు ధర లేక ఊహించని విధంగా రైతు కుటుంబాల ఆదాయంపై దెబ్బ పడింది. కోలుకోలేని పరిస్థితి. ఇప్పుడు యూరియా లేక పొలంలో వేసిన పంట ఎదుగుదల లేక రైతు కుటుంబాలు నాన్న అవస్థలు పడుతున్నాయి. అన్నదాతలకు దెబ్బ పైన దెబ్బ పడడంతో కోలుకోలేని పరిస్థితి ఏర్పడిందని అన్నదాతలు వాపోతున్నారు. దీనికి తోడు మండలంలో ఉన్న గ్రోమోర్ సెంటర్లో రెండు బస్తాల యూరియా కావాలంటే .. కాంప్లెక్స్ ఒక బస్తా కొనుగోలు చేయాలని నిబంధనలతో కూడిన ఆఫర్లు పెడుతున్నారు. దీంతో ములిగే నక్కపై తాటిపండు పడిన చందంగా వుందని రైతు పేర్కొంటున్నాడు.

వెదురుకుప్పం మండలంలో 25 పంచాయతీ లు ఉన్నాయి. ఇందులో 222 రెవెన్యూ గ్రామాలు . 80 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే వారే అధికంగా ఉన్నారు. రైతులు తమ పంట పొలాల్లో వరి , చెరకు, వేరుశనగ, మామిడి, పశుగ్రాసం, కూరగాయలు, ఆకుకూరలు ఇలా వారికి నచ్చిన పంటలను పండిస్తూ ఉంటారు. వీటన్నిటికీ కాంప్లెక్స్, యూరియా వాడుతామని రైతులు పేర్కొంటున్నారు. పశువుల పేడ , మడి ఆకు ఎంత వేసినా పైకి మాత్రం యూరియా కొంతైనా వాడితే పైరు నల్లగా తిరుగుతుందని రైతులు చెబుతున్నారు.

దుకాణాల నిబంధనలు

మండలం లోని పచ్చికాపల్లంలో వ్యవసాయ రైతుల కోసం గ్రోమోర్ సంస్థను ఏర్పాటు చేశారు. రైతులకు కావలసిన అన్ని రసాయన క్రిమిసంహారక, ఎరువులు ఇక్కడ దొరుకుతాయి. గత నెల రోజులుగా యూరియా ఒక బస్తాన్ని రైతులకు ఇస్తున్నారు. రెండో బస్తా కావాలంటే ఆ రైతు మరొక కాంప్లెక్సును కొనుగోలు చేయాలి. ఈ కాంప్లెక్స్ రూ.1200 నుంచి రూ.2 వేల రూపాయలు వరకు ధర ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. అంత ధర వెచ్చించి రెండవ బస్తాను కొనుగోలు చేయలేమని గగ్గోలు పెడుతున్నారు. కొనుగోలు చేసినా ఆ కాంప్లెక్స్ వాడేది లేక ఇంట్లోనే గడ్డలు కట్టే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిక్కుతోచని స్థితిలో రైతు కుటుంబాలు ఉన్నాయి. వరి పైరు మంచి పొట్ట దశ ఇప్పుడు యూరియా చల్లితేనే పంట దిగుబడి బాగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

రైతులు తిప్పలు వర్ణనాతీతం

ఒక యూరియా బస్తా సుమారు రూ.270 ఉంటుంది. గ్రోమోర్‌లో కృత్రిమ కొరత సృష్టించడంతో చేసేదేమీ లేక రైతులు పక్క రాష్ట్రమైన పళ్లిపట్టు నుంచి ఆటోలు, ఆర్‌టిసి బస్సుల సాయంతో వెదురుకుప్పం మండలానికి తెచ్చుకుంటున్నారు. ఇల్లు చేరే సరికి ఒక బస్తాకు రూ.330 వరకు ఖర్చు అవుతోందని రైతన్నలు చెబుతున్నారు. ఇలా ఎంతో కష్టనష్టానికి ఓర్చుకుని రైతులు యూరియాను కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నారు.

మాకు టార్గెట్ ఇచ్చారు..

కాంప్లెక్స్ నిల్వలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఇవి అమ్మకాలు పెరగాలని మాకు పై స్థాయి నుంచి టార్గెట్ ఇచ్చారు. కాంప్లెక్స్ అమ్మకుండా ఉంటే మా ఉద్యోగాలు పోతాయని గ్రోమోర్ సిబ్బంది వాపోతున్నారు. దీంతో గ్రోమోర్ సిబ్బంది దురుసు పదజాలంతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇలా అయితే ఎలా?



గడ్డి మొక్కలకు, ఆకుకూరలకు, వరి పంటకు కచ్చితంగా యూరియా వేయాలి. లేకపోతే పైరు రాదు. ఏమి చేయాలి. పేడ ఎంత వేసినా పైరు ఏపుగా రాదు. కొంతైనా యూరియా చల్లాలి.. గ్రోమోర్ వాళ్లు ఇలా నిబంధనలు పెడితే రైతులు ఏమి చేయాలి? ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి..

- భూపతి రైతు, కొణంగపల్లి , వెదురుకుప్పం మండలం.

ఘనంగా కలర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి -కార్వేటినగరం : కార్వేటినగరం లోని లక్ష్మీనరసింహ పాఠశాలలో శుక్రవారం ఘనంగా కలర్స్‌డే వేడుకలు కలసన డైరెక్టర్ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ కేజీ, యూకేజీ విద్యార్థుల తరగతి గదులలో పచ్చని రంగులతో పండ్లు, కూరగాయలు, ఆకులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. విద్యార్థులలో సృజనాత్మకత వెలికితీయడానికి, విభిన్న సమస్యల పరిష్కారానికి ఈ రకమైన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు హేమలత మాట్లాడుతూ విద్యార్థులు సాంస్కృతిక అంశాల పట్ల ఆసక్తి పెంపొందించడానికి ఈ కార్యక్రమాలు ఉపయోగపడుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ధనంజయ రెడ్డి, పురుషోత్తం, వెంకటేష్, ఉపాధ్యాయులు సౌమ్య, మమత, లీలావతి, విద్య, హంస, పాల్గొన్నారు.

పలమనేరు పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్పి మణికంఠ చందోలు

ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పి మణి కంఠ చందోలు శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలమనేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ సమస్యలు , లా అండ్ ఆర్డర్ సమస్యలను, వివిధ ఆర్థిక నేరాలకు సంబంధించిన పలు కీలక రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీ కేవలం పరిపాలన విధుల్లో భాగంగా పర్యవేక్షించినట్లు ఎస్పి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు డిఎస్పి డేగల ప్రభాకర్, సీఐ నరసింహరాజు, ఎస్ఐ లోకేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పులివర్తి లక్ష్మీ భారతికి నివాళి



ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తల్లి పులివర్తి లక్ష్మీ భారతీ మృతి చెందడం పట్ల పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ సంతాపం వ్యక్తం చేశారు. పాకాల మండలం, పులివర్తి వారి పల్లె గ్రామంలోని ఎమ్మెల్యే నివాసానికి మురళీ మోహన్ వెళ్లి లక్ష్మీ భారతీ భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, పులివర్తి నానిని ఓదార్చి ధైర్యంగా ఉండాలని తెలిపి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం మండల అధ్యక్షులు ఎన్‌పి ధరణీ నాయుడు, తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, ఐరాల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మేదరమిట్ల మోహన్ నాయుడు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి సంతాపం

ప్రజాశక్తి - రామకుప్పం: రామకుప్పం మండల పరిధిలోని బందార్లపల్లి పంచాయతీ, బిరుగుండ్లపల్లి గ్రామంలో టీడీపీ కార్యకర్త కమలమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. టిడిపి మండల కన్వీనర్ ఆనందరెడ్డి తో పాటు పలువురు టిడిపి నేతలు, కార్యకర్తలు గ్రామానికి చేరుకొని కమలమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతురాలి కుటుంబానికి పది వేలు రూపాయలు ఆర్థికసాయం అందించి తమ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, మాజీ సర్పంచ్ పెరుమాళ్, సుబ్రహ్మణ్యం, రంగనాథం, మురళి, గిడ్డపల్లి , బిరుగుండ్లపల్లి టిడిపి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంపునకు ఓపెన్‌స్కూళ్లు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ఓపెన్ స్కూళ్లను ఓపెన్ స్కూళ్లను ఏర్పాటు చేశారని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ప్రైవేట్ పాఠశాల వారికి ఓపన్ స్కూల్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గిరిబాబు, ప్రధానోపాధ్యా యులు గిరి రాజు, పలువురు ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

సూరయ్య గారి పల్లి
జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఎస్ నడింపల్లి పంచాయతీ సూరయ్య గారి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన ఇద్దరు విద్యార్థులు 1200 మీటర్ల పరుగు పందెంలో బంగారు, కాంస్య పతకాలు సాధించి పాఠశాలకు పేరు తెచ్చారని ప్రధానోపాధ్యాయురాలు శిరీష తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరసరావుపేటలో ఈనెల 11, 12 తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 1200 మీటర్ల పరుగు పందెంలో తమ పాఠశాలకు చెందిన మధు శ్రీ 9వ తరగతి బంగారు పతకాన్ని, ధనుష్ 8వ తరగతి కాంస్య పతకాన్ని సాధించినట్టు వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- రామకుప్పం: గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజలాపురం ప్రాథమిక ఆసుపత్రి వైద్య అధికారి పూజిత తెలిపారు. శుక్రవారం జౌకుపల్లి గ్రామంలో వైద్య సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, సిబ్బంది పుష్ప, గ్లోరీ, సరస్వతి, నీలమ్మ, ప్రేమ, శోభ పాలొన్నారు.

బోయకొండ గంగమ్మ ఆలయ ధర్మకర్త మృతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: వజ్రాల పుర బోయకొండ గంగమ్మ ధర్మకర్త రాధమ్మ (70) అనారోగ్య కారణంతో శుక్రవారం బెంగళూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శనివారం బంగారుపాలెం మండలం బొమ్మాయిపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. బోయకొండ గంగమ్మ ఆలయ నిర్మాణానికి ఆమె కృషి చేశారన్నారు.

సమస్యలు, సమాధానాలతో మండల సమావేశం

ప్రజాశక్తి -సోమల: సోమల మండల సమావేశం శుక్రవారం సమస్యలు, సమాధానాలతో సాగింది. మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు మందిరంలో శుక్రవారం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన మండల సర్వసభ్య సమావేశం 55 నిమిషాలు ఆలస్యంగా 11-55 నిమిషాలకు ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన ప్రారంభం అయింది. యథా ప్రకారం ఒక్కో శాఖ అధికారులు రావడం ప్రగతి నివేదికలను సమావేశానికి వినిపించారు. మొదట వ్యవసాయ శాఖ ఏవో సుధాకర్ మాట్లాడుతూ రాయతీ వేరుశనగ విత్తనాలు మండలానికి 957 క్వింటాళ్లు వచ్చాయని వర్షాభావ పరిస్థితులలో ఇప్పటివరకు కేవలం 12 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారని రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మిగిలిన రైతులు కూడా సాగు చేసే అవకాశం ఉందని జూలై 16 లోపు ఖరీఫ్ ముగిసినందున రైతులు విత్తనాలు వేసిన దిగుబడి తగ్గుతుందని ప్రతి రైతు 14 అంకెల యూనిక్ నెంబర్ కోసం రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందని మండలంలో 9570 మంది రైతులు ఉండగా 232 మంది రైతులు ఇంకా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉందని పీఎం కిసాన్ ఈ కేవైసీ 1300 మంది చేసుకోవాల్సి ఉందని సభకు తెలపగా ఎందుకు ఈకేవైసీ రైతులు చేసుకోవడం లేదని ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ నాయుడు నిలదీశారు. ఏవో సమాధానం చెబుతూ ఎన్నిసార్లు వారికి పీఎం కిసాన్ చేసుకోవాలి అని చెప్పిన రావడంలేదని వారే వచ్చి ఈ కేవైసీ చేసుకొని వేలిముద్ర వేయాల్సి ఉందని వారు వస్తే ఈకేవైసీ చేస్తామని తెలిపారు. పవర్ స్ప్రేలు, మడకలు అర్హులున్న ప్రతి ఒక్కరికి అందించాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోరారు. ఎరువుల దుకాణాలలో తనిఖీలు చేసి రైతులకు నాణ్యమైన ఎరువులు క్రిమిసంహారక మందులు అందేలా చూడాలని తనిఖీలు చేయడం లేదని ఒకంత ఆవేశంతో అడిగారు. ఎంఈఓ శివరత్నమ్మ మాట్లాడుతూ మండలంలోని 58 పాఠశాలల్లో 3239 మంది విద్యార్థులకు కిట్స్ అందించామని తెలిపారు. ట్రాన్స్‌కో ఏ ఈ మహేందర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ జె ఈ అనూష, పశుసంవర్ధకశాఖ చందన ప్రియ సలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఎంపీడీవో ఈశ్వరయ్య మాట్లాడుతూ సంఘ మిత్రలు జీతాలు బకాయి ఉన్నారని వెంటనే వారి జీతాలు అందజేయాలని ఆదేశించారు. ఎంపీడీవో నారాయణ మాట్లాడుతూ పి4 కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే చేసి యాప్ లో ఉన్న క్వశ్చన్ ప్రశ్నలకు సమాధానాలు తీసుకుంటూ ఇప్పటివరకు1863 కుటుంబాలు సర్వే చేశామని అదే విధంగా ఆగస్టు 15వ తేదీ లోపు బంగారు కుటుంబాలు ఎంపిక ప్రక్రియ కూడా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఎంపీటీసీలు సర్పంచులు ఎస్ఐ శివశంకర్ వీఆర్వోలు కార్యదర్శులు పాల్గొన్నారు.



ఆన్ లైన్ బెట్టింగ్ యాప్స్, సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ఆన్ లైన్ బెట్టింగ్ యాప్స్, సైబర్ నేరాల కట్టడికి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందని, అసెంబ్లీ పిటిషన్ల కమిటీ ద్వారా సైబర్ నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటామని ఉపసభాపతి, కమిటీ చైర్మన్ కె.రఘురామకృష్ణ రాజు తెలిపారు. శుక్రవారం అమరావతిలో అసెంబ్లీ కమిటీ హాలులో పిటిషన్ల కమిటీ సమావేశం నిర్వహించి ఆన్‌లైను బెట్టింగ్ యాప్స్ నియంత్రణ, సైబర్ నేరాలపై చర్చించారు. సమావేశంలో కమిటీ సభ్యులు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ చేయగానే సైబర్ నేరం రిజిస్టర్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బెట్టింగ్ యాప్స్ లపైనా ఈ నెంబర్ కు ఫిర్యాదు చేయవచ్చు అని చెప్పారు. ఇదే సమయంలో బెట్టింగ్ యాప్‌ల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు వల్ల శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం

ప్రజాశక్తి -పుంగనూరు: స్వచ్ఛ సర్వేక్షన్ రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు, జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు రావడంపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కమిషనర్ సన్మానించారు. ప్రజా సంఘాల నాయకుడు రాజా మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ జిల్లాలో మొదటి ర్యాంకు పుంగనూరు మున్సిపాలిటీ సాధించిన సందర్భంగా, రాష్ట్రస్థాయిలో ఏడవ ర్యాంకు సాధించడంతో సందర్భంగా చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మధుసూదన్ రెడ్డిని దుశ్శాలువలతో సన్మానించినట్లు తెలిపారు . పుంగనూరులో సంకల్ప సొసైటీ,మున్సిపల్ వారి సంయుక్త సహకారంతో ప్లాస్టిక్ బ్యాన్ పైన అవగాహన సదస్సులు, నార సంచులు గుడ్డ సంచులు విరివిగా ఉపయోగించాలని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాలు , తడి చెత్త పొడి చెత్త పైన అవగాహన కార్యక్రమాలు విరివిగా నిర్వహించడం వల్లే ఈ ర్యాంకు సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రెడ్డి, ముబారక్, కుమార్, ప్రజా సంఘాల నాయకులు ఆర్యవైశ్య యువ నాయకులు నందకుమార్ అమరావతి సురేష్ ,రాజేంద్ర, రాంకుమార్ ,కృష్ణమూర్తి పాల్గొన్నారు.



ఎన్ శరవణ కుమార్‌కు అభినందనలు



ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: చిత్తూరు 9వ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన ఎన్ శరవణ కుమార్ మూడు సంవత్సరాల పాటు కొనసాగనున్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. గంగాధర నెల్లూరు మండలం పెద్దకాలువ గ్రామానికి చెందిన శరవణకుమార్ న్యాయవాది వృత్తిలో 23 సంవత్సరాలుగా చిత్తూరు కోర్టులో కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

భవిత కేంద్రం తనిఖీ



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటినగరం మండల కేంద్రంలో ఉన్న భవిత కేంద్రాన్ని సహిత విద్య సమన్వయకర్త మధు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పిల్లలతో కొంత సేపు మాట్లాడి విద్యాపరమైన విషయాలను గురించి వారి, జ్ఞానానికి సంబంధించిన విషయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లల అభిరుచులు, వారి శారీరక, మానసిక పరిస్థితులను సహిత విద్య ఉపాధ్యాయురాలను అడిగి తెలుసుకున్నారు. ఏఎస్ఓ బాషా మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తర్వాత భవిత కేంద్రం రికార్డ్స్, రిజిస్టర్స్‌ను పరిశీలించి అక్కడ ఉపాధ్యాయులతో కొంతసేపు మాట్లాడి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయురాలు సింధుజ రేఖ పిల్లలు పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకుంటున్న యాదవ సమాజిక వర్గం

ఏఎంసీ ఛైర్మన్ నియామకంపై సంబరాలు

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా సమీపతి యాదవ్ నియామకంపై ఆ సామాజిక వర్గం సంబరాలు నిర్వహించింది. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో నూతన ఛైర్మన్ సమీపతి యాదవ్‌కు చెందిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి అభిమానులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపిలో కష్టపడిన వారికి ఫలితం ఖచ్చితంగా ఉంటుందంటే అందుకు నిదర్శనం సమీపత్ యాదవ్ అన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమించడంతో యాదవ సామాజిక వర్గంలో సముచిత స్థానం కల్పించినట్లేనని చెప్పారు. యాదవ్ సామాజిక వర్గం పుంగనూరు నియోజక వర్గంలో ఎప్పటికీ టిడిపికి కట్టుబడి పని చేస్తారన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి తమ సామాజిక వర్గం మొత్తం టిడిపి వైపే నడుస్తోంన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ యాదవ్, వెంకట్ రెడ్డి యాదవ్, ఎస్వీ రమణ, శివకుమార్, వడ్డెర సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, రమణ పాల్గొన్నారు.

పెనుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కృష్ణమనాయుడు



ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: పెనుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా గంగాధర నెల్లూరు మండలం లోని పాత పాల్యం పంచాయతీ మిట్టకొత్తూరు గ్రామానికి చెందిన కృష్ణమనాయుడు నియమితులయ్యారు. ఈయన పాతపాల్యం పంచాయతీ ప్రస్తుతం సర్పంచ్ గా ఉన్నారు. తనకి పదవి రావడంపై సీఎం చంద్రబాబు , మంత్రి నారా లోకేష్, ఇన్‌చార్జ్ మంత్రి రాం ప్రసాద్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్, చిత్తూరు ఎంపీ దగ్గు మళ్ల ప్రసాద్ రావు, పార్లమెంటు టిడిపి అధ్యక్షుడు సిఆర్ రాజన్‌కు కృష్ణమ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

పిఎఫ్ చెల్లింపుల వేగవంతానికి చర్యలు

జెడ్‌పీ సీఈవో రవికుమార్ నాయుడు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: భవిష్య నిధి రుణాలు, తుది మొత్తాల చెల్లింపులు వేగవంతమయ్యేలా చర్యలు చేపడుతున్నామని జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు తెలిపారు. శుక్రవారం ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్ , చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మదన్ మోహన్ రెడ్డి, బోడే మోహన్ యాదవ్ , చిత్తూరులో జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ను కలిసి వినతి పత్రం సమర్పించి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన వారికి తుది మొత్తాలు చెల్లించడంలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిపిఎఫ్ తరహాలో జెడ్ పిపిఎఫ్ ఖాతాదారులకు కూడా ప్రతి నెల, పిఎఫ్ చందాల జమలకు సంబంధించి ఎస్ఎంఎస్ సౌలభ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మిస్సింగ్ క్రెడిట్స్ నమోదుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కారుణ్య నియామకాలు వేగవంతం చేయాలని కోరారు. జెడ్పీ సీఈవో మాట్లాడుతూ, రాష్ట్రంలో మిగిలిన జిల్లాల కంటే చిత్తూరు జిల్లాలో భవిష్య నిధి ఖాతాల నిర్వహణ మెరుగ్గా నిర్వహించడానికి తాము కృషి చేస్తున్నామని తెలిపారు. పిఎఫ్ రుణాలు, తుది మొత్తాల చెల్లింపులు జాప్యం నివారించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు స్పందిస్తామని హామీ ఇచ్చారు , ఈ కార్యక్రమంలో ఎస్టియు నాయకులు లింగమూర్తి, చంద్రన్, నరేంద్ర పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగ్‌ల విక్రయ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ పరిధిలోని గంగమ్మ గుడి వీధిలోని జెఆర్‌వై షాపింగ్ కాంప్లెక్స్‌లో సింగల్ యూస్ ప్లాస్టిక్ కవర్ల నివారణ చర్యలలో భాగంగా పలమనేరు పురపాలక , మెప్మా సహకారంతో జ్యూట్ బ్యాగ్ ల విక్రయ కేంద్రాన్ని మునిసిపల్ కమిషనర్ రమణారెడ్డి శుక్రవారం ప్రారంభిం చారు. ఈ విక్రయ కేంద్రంలో వివిధ సైజులలో ఆవసరానుగుణంగా అతి తక్కువ ధర తో జ్యూట్ బ్యాగ్‌లను విక్రయిస్తారని వినియోగించుకోవాలని కోరారు.

స్థానిక ఏరియా హాస్పిటల్ ను కమిషనర్ తనిఖీ చేశారు. ఏరియా హాస్పిటల్‌లో అందుతున్న వైద్య సేవలు, పారిశుధ్య నిర్వహణ, సేవలు, రిజిష్టర్లు, వివిధ విభాగాలు గైనకాలజీ, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్, ఆపరేషన్ థియేటర్ మొదలగునవి తనిఖీ చేసి తగు సూచనలు ఇచ్చారు. రోగులతో సంభాషించి వారికి అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమమంలో కమిషనర్ రమణా రెడ్డి, కమీషనర్, మేనేజర్ , ఖాదరు మొహిద్దీన్, బాబా , మహిళామండల సంఘ సభ్యులు, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంటు, సిబ్బంది, కౌన్సిలర్లు సుబ్రహ్మణ్యం గౌడ్ , కుమార్ శెట్టి , ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ డెవలప్‌మెంట్ సభ్యులు నాగరాజు , ప్రజా ప్రతినిధులు గిరిబాబు , బలరాం శెట్టి (కుట్టి) పాల్గొన్నారు.

ద్రౌపదీ ధర్మరాజుల ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి -కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరం లో వెలసిన శ్రీదౌపదీ, ధర్మరాజుల స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 10,03,883 వచ్చినట్లు ఆలయ అధ్యక్షుడు రవియాదవు తెలిపారు. శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు మాట్లాడుతూ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కంకణాల ద్వారా రూ.3.12000, హుండీ ద్వారా రూ.75588, విరాళాలు, ఉభయదారుల ద్వారా రూ.616295 వచ్చిందన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు రూ.708513 ఖర్చులు పోను రూ.295370 లు మిగులు ఉందని, వీటిని ఆలయ అభివృద్ధికి వెచ్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి గౌతంరాజు, ఉపాధ్యక్షుడు కట్లరవిరెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి, ఉప కోశాధికారి సాయితాయల్, పలువురు పాల్గొన్నారు.

మూల్యాంకనం రెమ్యునరేషన్ చెల్లించండి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పదో తరగతి మూల్యాంకనం రెమ్యునరేషన్ చెల్లించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు శుక్రవారం ఏడీ వెంకటేశ్వరరావుని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు గంటా మోహన్, మదనమోహన్ రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు పూర్తయి మూడు మాసాలైనా ఇంతవరకు పేపర్లు దిద్దిన ఉపాధ్యాయులకు ఇవ్వవలసిన రెమ్యునరేషన్ చెల్లించలేదని వెంటనే చెల్లించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. చిత్తూరు జిల్లాలో బదిలీలకు ముందు ఇచ్చిన ప్రమోషన్లలో సోషల్ స్టడీస్, గణితం, బయాలజీ సబ్జెక్టులకు సంబంధించి ఉద్యోగోన్నతుల పోస్టులు మిగిలిపోయాయని , వెంటనే మిగిలిన పోస్టులను ఉద్యోగోన్నతి ద్వారా భర్తీ చేసి సబ్జెక్టు నిపుణుల కొరత ఉన్న పాఠశాలలకు న్యాయం జరుగుతుందన్నారు. స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను కూడా ఉద్యోగోన్నతి ద్వారా భర్తీ చేయాలని కోరారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమల్లో భాగంగా వివిధ ప్రాథమిక పాఠశాలలకు నేరుగా సరఫరా చేయకుండా క్లస్టర్ కేంద్రాల్లో సన్న బియ్యం, రాగి పిండి ఇస్తున్నారని దీనివలన ప్రాథమిక పాఠశాలల కేంద్రాలకు తీసుకు వెళ్లడానికి ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని కావున నేరుగా క్లస్టర్ పాఠశాలల్లో కాకుండా సరఫరా చేయవలసిన పాఠశాలలకు నేరుగా పంపిణీ చేయాలన్నారు.

మైనార్టీ గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నడుస్తున్న బాలికల గురుకుల పాఠశాలలలో ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా చేరేందుకు మైనారిటీ విద్యర్థులు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, పార్శికులు, బౌద్ధులు, జైనులు) దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమ అధికారి చిన్నారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు పట్టణం, మురకంబట్టు డోర్ నెం. 32-743లోని ఆంధ్రప్రదేశ్ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలలో విద్యార్థులు చేరడానికి 5వ తరగతి నుండి 8వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న మైనారిటీ బాలికల నుండి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 5 వ తరగతి - 61,6 వ తరగతి - 50,7 వ తరగతి - 42,8 వ తరగతి - 41 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. విద్యా బోధనతో పాటు వసతి సౌకర్యం, భోజన సదుపాయం, యూనిఫాం (దుస్తులు) పాఠ్య పుస్తకాలు, కాస్మోటిక్ ఛార్జీలు, వైద్య సౌకర్యం లాంటి వసతులు కల్పిస్తామన్నారు. వివరాలకు ప్రిన్సిపాల్, మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, చిత్తూరు 8712625058 ను సంప్రదించాలని సూచించారు.

అకాల వర్షాలకు పంటలు నష్టపోతే బీమా
మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్



ప్రజాశక్తి తవణంపల్లి: కరువు, తుపాను, అకాల వర్షం వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి తక్కువయి నష్టం వాటిల్లితే సంబంధిత అధికారులు పంట అంచనా వేసి తగిన నష్టాన్ని చెల్లిస్తారని అని అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ఖరీఫ్ 2025 కింద వరి, రాగులు, కంది వంటి పంటలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. మండలం ఒక యూనిట్ గా బీమా చెల్లిస్తారన్నారు. వరి ఎకరాకు ప్రీమియం 840 చెల్లిస్తే బీమా మొత్తం 42,000కు, రాగి ఒక ఎకరాకు 170 చెల్లిస్తే రూ.17000, కందికి రూ.400 చెల్లిస్తే 20 వేలు, అందిస్తారని తెలిపారు. వరికి ప్రీమియం చెల్లించు చివరి తేదీ ఆగస్టు 15, 2025 అని తెలిపారు. రాగి, కంది పంటకు ప్రీమియం నమోదు కోసం చివరి తేదీ 31 జులై 2025 గా నిర్ణయించారని తెలిపారు. ఎంపిక చేసిన పంటకు పంట రుణం తీసుకున్న రైతులకు సంబంధించి బ్యాంకు వారు ప్రీమియం వాసులు చేసే బీమా కంపెనీకి నేరుగా చెల్లిస్తారు, రుణం తీసుకొని రైతులు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ లో, డిజిటల్ అసిస్టెంట్ ద్వారా వారి ఆధార్ భూమి, కార్డు, పంట వేసిన ధ్రువ పత్రాన్ని బ్యాంకు వివరాలకు సంబంధించిన పత్రాలు సమర్పించి నమోదు చేసుకోవచ్చు అని అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: టిడిపి



ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజాభిప్రా యం ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే తమ ధ్యేయమని వాటిని పరిష్కరించేందుకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని టిడిపి నాయకులు తెలిపారు. శుక్రవారం బంగారెడ్డిపల్లి పంచాయతీ, తూగుండ్రం పంచాయతీలలో టిడిపి నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సమస్యలను తెలుసుకొని సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు స్వామి దాస్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ నియాజ్ అలీ, తెలుగు యువత మాజీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ధనంజయ నాయుడు, యువ నాయకుడు హరీష్ యాదవ్, మాజీ పీహెచ్చీ చైర్మన్ నరసింహులునాయుడు, జిల్లా క్రిస్టియన్ సెల్ ప్రధాన కార్యదర్శి శాంత కుమార్, జిల్లా టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం : కుప్పం నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం త్వరలో కృష్ణాజలాలను ప్రజలకు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టి కృషి చేస్తున్నారని ఆయన అపర భగీరథుడని రామకుప్పం మండల టిడిపి మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగును రామకుప్పం 73వ బూత్ పరిధిలో శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ ఓటర్లను కలిసి ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ త్వరలో కుప్పం నియోజకవర్గం తో పాటు రామకుప్పం మండలానికి హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు రానున్నాయని చంద్రబాబు కుప్పం ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అలివేలు శ్రీనివాసులు, మాజీ ఉపసర్పంచ్ గంటల రెడ్డి, బూత్ కమిటీ కన్వీనర్ మంజునాథ్, జిల్లా ఎస్‌సి సెల్ కార్యదర్శి జయశంకర్, వాణిజ్య విభాగం మండల అధ్యక్షుడు దయ, యూనిట్ ఇంచార్జ్ గజేంద్ర, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గిరిదాస్, నాగరాజు పాల్గొన్నారు.

ఐరాల: ఐరాల మండలం, చింతగుబ్బలపల్లె, మద్దిపాట్లపల్లె గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికీ టిడిపి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పాల్గొన్నారు. చింతగుబ్బలపల్లె గ్రామంలో 3 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల అధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, పూతలపట్టు నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ కో- ఆర్డినేటర్ గిరిధర్ బాబు, ఐరాల జెడ్పీటీసీ సుచిత్ర కన్నయ్య నాయుడు, మాజీ జెడ్పీటీసీ లతా బాబునాయుడు, ఐరాల సింగల్ విండో ఛైర్మన్ శేషాద్రి నాయుడు, నాయకులు మేదర్లమిట్ట మోహన్ నాయుడు, దేవాజీ, చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు , మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఆస్తి వివాదం

- భర్తపై భార్య కత్తితో దాడి- కుమార్తె ఫిర్యాదుతో కేసు నమోదు

ప్రజాశక్తి -కార్వేటినగరం: ఆస్తి వివాదాల్లో భర్తపై భార్య కత్తితో దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..కొల్లగుంట గ్రామానికి చెందిన జయవేల్(70) ఆయన భార్య రాజేశ్వరీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరందరికి వివాహాలు అయ్యి వాళ్ల ఒకో చోట స్థిరపడి పోయారు. అయితే గత 10 సంవత్సరాలుగా భార్య భర్తల మధ్య ఆస్తి వివాదం ఉంది. జయవేల్ తమ సొంత గ్రామం కొత్తపల్లిమిట్టలో ఉన్న ఆస్తి మొత్తాన్ని అమ్మి కొల్లాగుంటలో ఆస్తి కొనుగోలు చేసి భార్య పేరుతో సొంత ఇంటి నిర్మాణం చేసుకొని స్థిరపడ్డారు. ఈ క్రమంలో భార్య భర్తలకు నిత్యం గొడవలు ప్రారంభమై జయవేలును చంపిస్తామని భార్య బెదిరింపులకు గురి చేయడంతో జయవేల్ తనకు భార్య వల్ల ప్రాణహానీ ఉందని పిర్యాదు చేశారు. దీంతో వారిరువురికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ వివాదం కోర్టులో కూడా కేసునడుస్తోంది. గురువారం భార్య భర్తలు కోర్టుకు హాజరై వచ్చారు. అయినప్పటికీ తీరుమార్చుకోని భార్య రాజేశ్వరీ గురువారం రాత్రి ఆయనతో తీవ్రంగా గొడవపడింది. దీంతో శుక్రవారం తమ బంధువులతో కలసి జయవేలు కత్తితో నరికి హత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. స్థానికులు గుర్తించి అతనికి 108 వాహనం ద్వారా కార్వేటినగరం సీహెచ్సీకి తరలించి, మెరుగైన చికిత్సకోసం తిరుపతి రుయాకు తరలించారు. తండ్రిపై దాడిజరిగినట్లు సమాచారం అందుకున్న ఆయన కుమార్తెలు స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాధు చేశారు.

గంగమ్మ ఆలయ హుండీ చోరీ

ప్రజాశక్తి-చౌడేపల్లి: మండలంలోని సెట్టిపేట పంచాయతీ కొత్త ఇండ్లు నెల్లిపుల్లి గంగమ్మలయంలో చోరీ చోటుచేసుకుంది. గ్రామానికి సమీపంలో పొలాల మధ్య ఆలయం వుంది. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయానికి ఉన్న గేటు తాళాలు పగలగొట్టి లోపల ఉన్న హుండీ తెరచి అందులోని నగదును అపహరించుకుని వెళ్లారు అంతేకాకుండా అమ్మవారి మెడలోని రూ 20 వేలు విలువచేసే బంగారం నల్లపూసల దండను దొంగలించుకుని వెళ్లారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రస్తుత చిత్తూరు జిల్లాలో గత విద్యా సంవత్సరం 2024-25 అనగా 30 ఏప్రిల్ 2025 తేదీ వరకు పనిచేసిన ఒప్పంద అధ్యాపకుల పని కాలాన్ని 2025-26 విద్యా సంవత్సరం కొనసాగింపునకు ఆంధ్రప్రదేశ్ కళాశాల సంచాలకులు (ఉన్నత విద్యాశాఖ) ఆదేశాలు జారీ చేశారు. గత సంవత్సరంలో పనిచేసిన ఒప్పంద అధ్యాపకులు కొనసాగింపు కోసం దరఖాస్తులను పదో తరగతి సర్టిఫికెట్ తో జతపరిచి సంబంధిత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఈనెల 20వ తేదీ లోపు అందజేయాలి. ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) చిత్తూరు ఐడి కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నాగేంద్ర తెలిపారు. జిల్లా పరిధిలోని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆ దరఖాస్తులను 21-07-2025 ఐడి కళాశాల ప్రిన్సిపల్ కి అందించాలని తెలిపారు. కౌన్సెలింగ్ సంబంధించిన సమాచారాన్ని ఆయా కళాశాల ప్రిన్సిపల్ ద్వారా సమాచారాన్ని పొందాలని కోరారు.

చెత్త సేకరణ కేంద్రాలు వినియోగించాలి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: గ్రామ పంచాయతీలలో చెత్త సేకరణ కేంద్రాలు వినియోగంలో వుండాలని డిపిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ హరిప్రసాద్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ మీటింగ్ హాల్లో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చెత్త తొలగింపు కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పారిశుధ్యం పై ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాల మేరకు పనులు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని క్లాస్ మిత్ర కచ్చితంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పంచాయతీ సెక్రెటరీ శివయ్య, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభ్యసనా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : మండలంలోని కృష్ణాపురం వెంగన్న కండ్రిగ గ్రామంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలకు పుత్తూరుకు చెందిన శ్రీ సరస్వతి మాత సాంఘిక సేవా సంఘం వారు ఎంఈవో నమశ్శివాయం చేతుల మీదుగా విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు, ప్లేట్లు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతి సేవా మాత సాంఘిక సేవా సంస్థ సభ్యులు అమర్నాథ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు నిమ్మి, ఉపాధ్యాయులు వల్లియమ్మ, బాలసుబ్రమణ్యం రాజు, నాగరాజా రెడ్డి, మునస్వామి, రాజకుమార్ పాల్గొన్నారు.

విజయపురం: మండలం శ్రీహరిపురం ఆదర్శపాఠశాల విద్యార్థులకు శుక్రవారం శ్రీ సరస్వతి మాత సాంఘిక సేవా సమాజం సహకారం తో 50 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, పలకలు, రాతపుస్తకాలు, బ్యాగులు, పెన్స్, పెన్సిల్స్ ఎం ఈ వో హరిప్రసాద్ వర్మ పంపిణి చేశారు. దాతల సాయంను సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత ఏం ఈ వో యుగంధర్ రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు వెంకమరాజు, విశ్రాంత ఏం ఈ వో జయదేవరాజు, నెహ్రూ యువజన సేవా సంఘం అధ్యక్షులు జ్యోతిలక్ష్మి పాల్గొన్నారు.

పేదలకు పనిముట్లు అందజేత

ప్రజాశక్తి -విజయపురం (నగరి): పట్టణ పరిధిలోని ఓంశక్తి ఆలయంలో 33వ గురుపాద వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నదానం, వస్త్రదానం చేశారు. పేదలకు పనిముట్లు ,కుట్టు మిషన్లు, గ్యాస్ స్టవ్‌లు, రైతులకు స్ప్రేయర్లు, మహిళలకు రోజువారి జీవనం సాగించుటకు ఇడ్లీ పాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా మరువత్తూర్ ఆదిపరాశక్తి ప్రచార కమిటీ అధ్యక్షులు గంగాధరం, యాగ అధ్యక్షులు సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు ఉమాపతి టీటీడీ ఆలయ అధికారులు వెంకటరమణ, గుణశేఖర్ ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఏఈ దేవి ప్రసన్న

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బంగారుపాలెం మండలంలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తును నిలిపివేసి సాంకేతిక పరమైన సమస్యలను పరిష్కరించిన తర్వాత పునరుద్ధరిస్తామని విద్యుత్ శాఖ ఏఈ దేవి ప్రసన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు దీనికి సహకరించాలన్నారు.